## నేడు ముఖ్య కార్యకర్తల సమావేశం

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 11: నేడు మొయినాబాద్‌లో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన చేవెళ్లలో విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్భంగా మొయినాబాద్ మండలంలోని స్టార్ కన్వెన్షన్ హాల్‌లో చేవెళ్ల నియోజకవర్గం నాయకులతో ముఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

## దెబ్బతిన్న పంటల పరిశీలన



వరి పంటను పరిశీలిస్తున్న ఏఈవో లింగస్వామి

మంచాల, ఏప్రిల్ 11: మంచాల మండల పరిధిలోని దాద్‌పల్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన వేంకటేశ్వర తండాలో గురువారం రాత్రి కురిసిన వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటలను శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారి లింగస్వామి క్షేత్రస్థాయికి వెళ్లి పంటలను పరిశీలించారు. వెంకటేశ్వర తండాలో 11ఎకరాల్లో వరి పంట వడగండ్ల వానకు నష్టం వాటిల్లిందని చెప్పారు. గ్రామానికి చెందిన లక్ష్మణ్, రమావత్ కేశ్య, దేష్యా, లచ్యా, రాజు మేతీరాంతో పాటు తదితర రైతులకు చెందిన వరి పంట పొలాలు వడగండ్ల వానకు పూర్తిగా దెబ్బతిన్నట్లు చెప్పారు. వడగండ్ల వానకు నష్టపోయిన రైతుల వివరాలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి రైతులకు తగు న్యాయం చేయనున్నట్లు చెప్పారు.

## ఘన సన్మానం




ఆమనగల్లు, ఏప్రిల్ 11: ఆమనగల్లు సీఐగా 14 నెలలు విధులు నిర్వహించి సాధారణ బదీలీల్లో భాగంగా శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ ట్రాఫిక్ సీఐగా బదిలీపై వెళ్తున్న ప్రమోద్‌కుమార్‌ను శుక్రవారం ఆమనగల్లు, తలకొండపల్లి ఎస్ఐలు వెంకటేష్, శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు అదనపు ఎస్సై సీతారాంరెడ్డి, ఏఎస్సైలు బాల్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు లక్ష్మణ్, శ్రీనివాస్‌గౌడ్, టైటాస్, సిబ్బంది శ్రీను, శ్రీశైలం, శివకుమార్, రఘు, మహేష్, శివరెడ్డి, భాను, ప్రవీణ్, పుష్పలత, సుజాత, శశిరేఖ, మల్లేష్, శ్రీశైలం, నాగరాజు, భాస్కర్ పాల్గొన్నారు.

## కూలీలకు జాబ్ కార్డులు అందజేయాలి

షాద్‌నగర్‌రూరల్, ఏప్రిల్ 11: ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వం జాబ్‌కార్డులను అందజేయాలని కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్ డిమాండ్ చేశారు. జాబ్‌కార్డులను మంజూరు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుండడంతో గ్రామీణ ప్రాంతాల్లోని ఎంతో మంది ఉపాధి హామీ కూలీలు వలసబాట పట్టే పరిస్థితి నెలకొన్నదన్నారు. అదే విధంగా వేసవికాలం దృష్టిలో పెట్టుకుని కూలీలకు అన్ని వసతులను కల్పించాలన్నారు.

## రోడ్డు ప్రమాద ఘటన కేసులో పోలీసుల అదుపులో నిందితుడు

పెద్దఅంబర్‌పేట, ఏప్రిల్ 11: అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని కొహెడ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో బైక్‌ను ఢీకొట్టిన బీ ఫార్మసీ విద్యార్థిని స్పందన మృతికి కారణమైన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏపీలోని గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన వ్యాపారి ప్రదీప్ వర్మ విజయవాడ వైపు నుంచి కారులో నగరం వైపు వస్తున్నాడు. గురువారం రాత్రి ఓఆర్ఆర్ వద్ద కొహెడ సర్వీస్ రోడ్డుపై ముందుకెళ్లాడు. కొద్దిసేపటికే గుర్తించి తిరిగి ఓఆర్ఆర్ ఎక్కేందుకు కారును తిప్పాడు. అదే సమయంలో బీ ఫార్మసీ విద్యార్థిని స్పందన (19), సాయికుమార్ సంఘివైపు బైక్‌పై వెళ్తున్నారు. కారు ఎదురుగా వచ్చి వీరి బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో స్పందన, సాయికుమార్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే హయత్‌నగర్‌లోని ప్రైవేటు దవాఖానకు తరలించగా.. స్పందన అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించిన విషయం తెలిసిందే. సాయికుమార్ తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదం జరిగిన వెంటనే అక్కడ నుంచి కారుతో సహా పరారైన ప్రదీప్‌ను చైతన్యపురి వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కారును స్వాధీనం చేసుకుని ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యక్తి అదృశ్యం



పాత్లవత్ రవి (ఫైల్)

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 11 : భార్యతో గొడవపడి ఇంట్లోంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన శంకర్‌పల్లి మండల పరిధి మోకిలా పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది. మోకిలా సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కొండకల్ తండాకు చెందిన పాత్లవత్ రవి (33) భార్య తేజశ్రీతో కలిసి కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. ఈనెల 7వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు భార్య తేజశ్రీతో గొడవపడిన పాత్లవత్ రవి ఇంట్లోంచి వెళ్లిపోయాడు. ఎంతకీ తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పాత్లవత్ రవి సోదరుడు పాత్లవత్ లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ వీరబాబు తెలిపారు.

## దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు

షాద్‌నగర్‌టౌన్, ఏప్రిల్ 11: వేసవికాలం దృష్ట్యా వివిధ ప్రాంతాల నుంచి షాద్‌నగర్ పట్టణానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర నాయకుడు రమేష్ తెలిపారు. శుక్రవారం చలివేంద్రాన్ని ప్రారంభించగా, మున్సిపల్ మాజీ చైర్మన్ కొందూటి నరేందర్, పలువురు నాయకులు ఈ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రతి సంవత్సరం వేసవికాలంలో తల్లిదండ్రుల జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ చైర్మన్ మధన్‌మోహన్‌రెడ్డి, న్యాయవాది మహేందర్‌రెడ్డి, నాయకులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సుధాకర్, నర్సింహులు పాల్గొన్నారు.

# మహనీయుడు జ్యోతిరావుపూలే



చేవెళ్లటౌన్: పూలే విగ్రహానికి పూలమాల వేస్తున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



చేవెళ్లటౌన్: పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య



శంకర్‌పల్లిలో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ యోగేశ్



కొత్తూరులో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు



యాచారంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

**పూలేకు ఘన నివాళి**

**జయంతిలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, వివిధ సంఘాల నేతలు**

**మహాత్మా జ్యోతిరావుపూలే** జయంతి సందర్భంగా ఆయా నియోజకవర్గాల పరిధిలోని వివిధ మండలాల్లోని గ్రామాలు, పట్టణాల్లో శుక్రవారం పూలే చిత్రపటం, విగ్రహాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని కొనియాడారు. బడుగు బలహీన వర్గాలను విద్యావంతులను చేసేందుకు పూలే చేసిన కృషి చిరస్మరణీయమన్నారు.

\- న్యూస్‌నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ



షాద్‌నగర్ పట్టణంలో మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఆమనగల్లు : పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



షాద్‌నగర్ పట్టణంలోని మహాత్మా జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



ఇబ్రహీంపట్నం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జ్యోతిరావుపూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజ్‌కుమార్ తదితరులు



షాబాద్‌లో జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీసేన జాతీయ అధ్యక్షుడు కృష్ణయాదవ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్ తదితరులు



మొయినాబాద్‌లోని చిన్నమంగళారం గ్రామంలో జ్యోతిరావు పూలేకు నివాళులర్పిస్తున్న నాయకులు



కడ్తాల్: మండల కేంద్రంలో జ్యోతిరావ్‌పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు



మంచాల మండలంలోని నోముల పాఠశాలలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

## ఘనంగా కిషన్‌రెడ్డి జన్మదిన వేడుకలు



మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

**శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు**

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 11 : బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డిజిల్లా అధ్యక్షుడు, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం మండలం ఎలిమినేడు గ్రామంలోని ఆయన వ్యవసాయక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలతో పాటు ఇబ్రహీంపట్నం, తుర్కయాంజాల్, ఆదిబట్ల, పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీలతో పాటు జిల్లాలోని ఆయా నియోజకవర్గాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున కేక్ కట్ చేయించారు.

**యాచారంలో..**

యాచారం : బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా బీఆర్ఎస్ మండల నాయకులు శుక్రవారం ఆయనను కలిశారు. మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రమేష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పాచ్చభాష, పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, నాయకులు రాజునాయక్, యాదయ్యగౌడ్, హబీబుద్దీన్, కృష్ణ, శంకర్‌నాయక్, ఖాజు, వెంకటేష్, శివ తదితరులు అధిక సంఖ్యలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## పన్నువసూళ్లలో చందానగర్ నాల్గో స్థానం




ఆస్తి పన్ను విభాగం ఏఎంసీలు, ఇతర సిబ్బందితో ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి

మియాపూర్, ఏప్రిల్ 11: 2024 – 25 ఆర్థిక సంవత్సరానికి గాను ఆస్తి పన్ను వసూళ్లలో చందానగర్ సర్కిల్‌కు గ్రేటర్‌లో నాలుగో స్థానం లభించిందని సర్కిల్ ఉప కమిషనర్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. పన్ను విభాగం అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో ఈ గుర్తింపు లభించినట్లు తెలిపారు. పన్ను వసూళ్లలో కృషిచేసిన సిబ్బందిని బంజారాహిల్స్‌లోని బంజారా భవన్‌లో ఉన్నతాధికారులు శుక్రవారం అభినందించారు. డీసీ మాట్లాడుతూ.. గత ఆర్థిక సంవత్సరానికి గాను సర్కిల్ రూ.109 కోట్ల వసూళ్లను చేపట్టి బల్దియాలో నాలుగో స్థానంలో నిలిచిందన్నారు. ఏఎంసీలు టీఐలు బీసీలు అందరి కృషి ఫలితంగా పురోగతి సాధించామ న్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి గాను ఎర్లీ బర్డ్ పథకం ఈ నెల అమలులో ఉంటుందని ఏకకాలంలో చెల్లించి ఐదు శాతం రాయితీని పొందాలని కోరారు. వరుస మూడు రోజుల సెలవుల నేపథ్యంలో క్షేత్రస్థాయి బిల్ కలెక్టర్లు, సర్కిల్ కార్యాలయంలో సిటిజన్ సేవ కేంద్రాలు అందుబాటులో ఉంటాయని పన్నుదారులు చెల్లింపు నిమిత్తం అవకాశాన్ని వినియోగించుకోవాలని డీసీ మోహన్ రెడ్డి కోరారు. కార్యక్రమంలో సర్కిల్ పన్ను విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలి

షాబాద్, ఏప్రిల్ 11: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరను వెంటనే తగ్గించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు సునీత అన్నారు. శుక్రవారం షాబాద్ మండల కేంద్రంలోని ముంబాయి–బెంగూళూరు లింకు జాతీయ రహదారిపై ఖాళీ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్రమోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర ధరలు పెంచి పేదలను ఇబ్బందులకు గురి చేస్తుందని మండిపడ్డారు. పెంచిన ధరలను తగ్గించుకుంటే బీజేపీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డిజిల్లా మహిళా అధ్యక్షురాలు పామెన జ్యోతి, నియోజకవర్గం ఉపాధ్యక్షురాలు అశ్విని, మండల మహిళా విభాగం నాయకురాలు అనితారెడ్డి, పార్టీ నాయకులు రవీందర్, చెన్నయ్య, అస్మత్‌పాషా, రాములు, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## చిరు ధాన్యాల్లో పుష్కలంగా పోషకాలు

**ఐసీడీఎస్ సీడీపీవో శాంతిరేఖ**



కడ్తాల్ : మహిళలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో శాంతిరేఖ

కడ్తాల్, ఏప్రిల్ 11: గర్భిణులు, బాలింతలు ప్రతిరోజూ చిరు ధాన్యాలు తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండవచ్చని ఐసీడీఎస్ సీడీపీవో శాంతిరేఖ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రావిచేడ్, మద్దెలకుంట తండాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోషక పక్షం వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మహిళలకు చిరుధాన్యాల ప్రాముఖ్యత, పరిశుభ్రత, తల్లి పాల విశిష్ఠత గురించి వివరించారు. చిరుధాన్యాల్లో అత్యధికంగా పోషక విలువలు ఉంటాయని తెలిపారు. నిత్యం ఆహారంలో రాగులు, సజ్జలు, కొర్రలు, జొన్నలు, సాములు, అరికలు తీసుకోవాలని పేర్కొన్నారు. బాలికల్లో రక్తహీనత రాకుండా ఉండేందుకు ఆకుకూరలు, కూరగాయాలు తినాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శబరి, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, నస్రిన్‌సుల్తానా, వాణిశ్రీ, సువర్ణ, ఆశా కార్యకర్త అనిత, మహిళలు పాల్గొన్నారు.

**కాకునూరులో..**

కేశంపేట : మండల పరిధిలోని కాకునూరు గ్రామంలో కేశంపేట ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దివ్య ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు మాధవి, మంజుల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఝాన్సీ, పద్మ, గర్భిణులు, బాలంతలు పాల్గొన్నారు.

## రైతు సంఘం జెండా ఆవిష్కరణ



రైతు సంఘం జెండాను ఎగురవేస్తున్న మాధవరెడ్డి

తుర్కయాంజాల్, ఏప్రిల్ 11: ఆల్ ఇండియా కిషన్ సభ ఆవిర్భవించి 89 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం రంగారెడ్డి జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధి కొహెడలో రైతు సంఘం జెండాను ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణరెడ్డి, బాల్‌రెడ్డి, ఎల్లేశ్, అనిల్, రేఖ, ఆండాలు పాల్గొన్నారు.

## 15న ఉచిత కంటి వైద్య శిబిరం


ఆమనగల్లు, ఏప్రిల్ 11 : లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఈ నెల 15న ఆమనగల్లు ప్రభుత్వ దవాఖాన ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి, పీఆర్‌వో పాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి శుక్లాలు, కంటి చూపు మందగించిన వారు, కంటి సమస్యలు ఉన్న వారందరూ ఆధార్ కార్డు, రేషన్ కార్డు తీసుకుని ఈ శిబిరానికి హాజరై పరీక్షలు చేయించుకోవాలని వారు సూచించారు.

## ఎల్‌వోసీ అందజేత



కడ్తాల్, ఏప్రిల్ 11: తలకొండపల్లి మండల పరిధిలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన రాములు అనారోగ్యంతో బాధపడుతూ, నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని స్థానిక నాయకుడు ప్రదీప్‌రెడ్డి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన రూ.45వేల ఎల్‌వోసీని మంజూరు చేయించారు. శుక్రవారం ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారుడి కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీని అందజేశారు. ఆయన వెంట నాయకులు ప్రభాకర్‌రెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, మల్లయ్య, నరేశ్ ఉన్నారు.

## ఆర్థిక సాయం



కొత్తూరు, ఏప్రిల్ 11: ఆడపిల్ల వివాహానికి బీఆర్ఎస్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ ఆర్థిక సాయం అందించారు. కొత్తూరు మండల పరిధిలోని ఖాజగూడ తండాకు చెందిన విస్లావత్ రవికుమార్ కూతురు వివాహానికి ఎమ్మె సత్యనారాయణ ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ బాల్‌రాజు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ భీమయ్య ఉన్నారు.

## కబ్జాకు గురికాకుండా చెరువు కత్వను కాపాడాలి

అబ్దుల్లాపూర్‌మెట్, ఏప్రిల్ 11 : మండలంలోని అనాజ్‌పూర్ వేముల కత్వ, ఇంద్రమ్మ సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో రియల్‌ఎస్టేట్ వ్యాపారులు వేస్తున్న రోడ్డు పనులను సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులను పిలిపించి పనులను నిలిపివేయించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి యాదయ్య మాట్లాడుతూ పర్యావరణాన్ని రక్షించి చెరువు కత్వను కబ్జాదారుల నుంచి కాపాడాలన్నారు. ఓ రియల్‌ఎస్టేట్ వ్యాపారులు 300 ఎకరాల భూమిని చదును చేస్తూ అందులో విల్లాస్ నిర్మిస్తున్నారని, దానికి నాలా కన్వెన్షన్, హెచ్ఎండీఏ, మైనింగ్, ఇరిగేషన్ అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేవని ఆరోపించారు. అనాజ్‌పూర్ గ్రామానికి జీవనాధారమైన ఇందిరమ్మ సాగర్, వేముల కత్వను ఇప్పటికే ఓ పక్క కొందరు ప్రహరీ నిర్మించారన్నారు. ప్రస్తుతం చదును చేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో గుట్టలను ధ్వంసం చేసి రాళ్లను చెరువులో వేస్తూ పూడ్చివేస్తున్నారని అన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా భారీ రోడ్డు వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ వెంచర్ యాజమాన్యం ప్రభుత్వ అండతో విచ్చలవిడిగా కబ్జాలు చేస్తూ అటువైపు ఎవరైనా వస్తే బెధిరింపులకు పాల్పడుతున్నారని తెలిపారు. బఫర్‌జోన్‌లో అక్రమంగా రోడ్డు వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ, నాయకులు ముత్యాలు, జంగయ్య, శివకుమార్, మహేశ్వరం లింగస్వామి, శ్రీనివాస్, రైతులు వెంకటేశ్, మహేశ్, బాల్‌రాజ్, ఐలయ్య, ప్రణయ్ ఉన్నారు.